క్లుప్తంగా

30న మున్సిపల్ సాధారణ సమావేశం

రేపల్లె: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఈ నెల 30వ తేదీ సోమవారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో కౌన్సిలర్‌లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

మసీదు ప్రారంభం

నిజాంపట్నం: మండల కేంద్రమైన నిజాంపట్నంలో నూతనంగా నిర్మించిన మసీదును శుక్రవారం ప్రారంభించారు. మసీదును మాజీ మంత్రి మోపిదేవి వెంకట రమణారావు ప్రారంభించి మాట్లాడారు. దైవారాధన గల ప్రాంతాలు సుఖశాంతులతో వర్ధిల్లుతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ దైవసేవకు కొంత సమయం కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్, బొమ్మిడి రామకృష్ణ, మోపిదేవి హరనాధబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏడీఏగా లక్ష్మి బాధ్యతలు స్వీకరణ



రేపల్లె: వ్యవసాయ శాఖ రేపల్లె డివిజన్ సహాయ సంచాలకులుగా అద్దేపల్లి లక్ష్మి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. బాపట్ల ఏడీఏగా పనిచేస్తూ సాధారణ బదిలీపై రేపల్లె విచ్చేశారు. ఇన్‌చార్జ్ ఏడీఏగా పనిచేసిన విజయరాజు గురజాల బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన లక్ష్మి మాట్లాడుతూ డివిజన్‌లోని రైతులకు అందుబాటులో ఉండి నాణ్యమైన సేవలు అందిస్తామన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సలహాలు అందిస్తామని చెప్పారు. బాధ్యతలు స్వీకరించిన లక్ష్మికి డివిజన్‌లోని ఏవోలు, కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శించిన డాక్టర్ గణేష్



నగరం: మండలంలోని కొలగానివారిపాలెం గ్రామానికి చెందిన న్యాయవాది కొండపల్లి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను శుక్రవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ పరామర్శించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో శ్రీనివాసరావు మృతి చెందడంతో డాక్టర్ గణేష్ శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. తొలుత శ్రీనివాసరావు చిత్రపటం వద్ద పూలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మండల కన్వీనర్ ఇంకొల్లు రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి లుక్కా బాపనయ్య, నాయకులు యార్లగడ్డ మదన్‌మోహన్, బాలాజీ, కొలగాని శ్రీనివాసరావు, బాబురావు, శ్యాం ప్రసాద్, అమూల్య ఉన్నారు.

నీటి తీరువా వసూళ్లు త్వరితగతిన చేయాలి



అమర్తలూరు(వేమూరు): నీటి తీరువా వసూళ్లు త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దారు నెహ్రూబాబు తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వీఆర్వోలతో సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డులు కూడా త్వరగా అందజేయాలని ఆయన సూచించారు. మండలంలో మొత్తం 5,650 కౌలు కార్డులు ఇవ్వాల్సి ఉందన్నారు. వీఆర్వోలు, గ్రామ వ్యవసాయ సహాయకులు సమన్వయంతో కౌలు రైతులందరికీ కార్డులు ఇవ్వాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు రాజా రమేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు ముఖ ఆధారిత నమోదు



భట్టిప్రోలు(వేమూరు): అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు ముఖ ఆధారిత నమోదు చేయడం జరుగుతుందని అమర్తలూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి ఎ.లక్ష్మీదేవి తెలిపారు. భట్టిప్రోలు మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కార్యకర్తల సెక్టార్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సమయపాలన పాటించాలని ఆమె సూచించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలని సూచించారు. జూలై 1వ తేదీ నుంచి అంగన్‌వాడీ పిల్లలకు ముఖ ఆధారిత నమోదు చేపట్టడం జరుగుతుందని చెప్పారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సంపూర్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బక్క చిక్కిపోతున్న కాల్వ కట్టలు

- అక్రమంగా తరలుతున్న పంట, మురుగు కాల్వల కట్టల మట్టి
- పట్టించుకోని ఇరిగేషన్, డ్రైనేజ్ అధికారులు
- వర్షాకాలంలో కట్టలు తెగిపోయే ప్రమాదం.. ఆందోళనలో రైతులు



ఈదుపల్లిలో రాత్రి సమయంలో జేసీబీతో పంట కాల్వలో మట్టిని తవ్వుతున్న దృశ్యం

నగరం: పచ్చనేతల భూ దాహానికి పంట, మురుగు కాల్వల కట్టలు బక్క చిక్కి శల్యమైపోతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి పంట, మురుగుకాల్వల మట్టిని కూటమి నేతలు అక్రమంగా తరలించి జేబులు నింపుకుంటున్నారు. ఎక్కడ మట్టి అవసరమైనా మురుగు కాల్వల కట్టల మట్టిని యథేచ్ఛగా తరలిస్తుండటంతో కాల్వ కట్టలు బలహీనమవుతున్నాయి. రేపల్లె ప్రధాన మురుగు కాల్వ(ఆర్‌ఎం డ్రెయిన్), ఓల్డ్ కోర్స్ కాల్వ కట్టల మట్టిని అక్రమంగా తరలిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువవ్వడంతో కాల్వ కట్టలు బక్కచిక్కిపోతున్నాయి. పూడివాడ సమీపంలో మురుగుకాల్వ కట్టల మట్టిని అక్రమార్కులు తమ ఇష్టానుసారం తరలించుకోపోతున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా కాల్వ కట్టల మట్టిని జేసీబీతో తవ్వి ట్రాక్టర్‌లతో తరలిస్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదంటే డ్రైనేజ్ అధికారుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

కట్టలు తెగిపోయే ప్రమాదం

కొంత మంది అక్రమార్కులు రాత్రి సమయంలో ఎక్కడ పడితే అక్కడ కాల్వ కట్టల మట్టిని తరలించుతున్నారు. మండలంలోని ఈదుపల్లి గ్రామంలో పంట కాల్వల మట్టిని రాత్రికి రాత్రే తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పూడివాడలో బక్కయ్య పంటకాల్వ, శిరిపూడిలోని పంట కాల్వల మట్టిని యథేచ్ఛగా తరలిస్తున్నారని రైతులు వాపోతున్నారు. పంట కాల్వల మట్టిని తరలిస్తే కాల్వ కట్టలు బలహీనమై వర్షాల సమయంలో కట్టలు తెగిపోయే ప్రమాదం ఉందని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. రహదారి అభివృద్ధి పనులకు సైతం కాల్వ కట్టల మట్టిని వినియోగిస్తున్నా ఇటు పాలకులు గానీ, అటు అధికారులు గానీ పట్టీపట్టనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తుంది.



పూడివాడ సమీపంలో ఓల్డ్ కోర్స్ మురుగుకాల్వ కట్ట మట్టిని తొలగించిన దృశ్యం

మురుగుకాల్వ కట్టల మట్టే టార్గెట్‌గా మట్టి మాఫియా

మట్టి మాఫియాకు చెందిన కొంత మంది మురుగు కాల్వ కట్టల మట్టిని టార్గెట్ చేస్తున్నారు. మట్టి అవసరమైతే చాలు వెంటనే జేసీబీతో ఎక్కడ వీలు ఉంటే అక్కడ కట్టల మట్టిని తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలతోనే మట్టి మాఫియా సాగుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే రహదారులు నిర్మించే చిన్న, చిన్న కాంట్రాక్టర్‌లు సైతం కాల్వ కట్టల మట్టిని తరలిస్తున్నారు. కాంట్రాక్టర్‌లు మట్టిని కొనుగోలు చేసి రహదారి నిర్మాణాలకు మట్టిని తోలాల్సి ఉంది. కానీ మురుగుకాల్వల మట్టినే తరలించడం గమనార్హం. కాల్వ కట్టల మట్టిని తరలించడంపై కట్టలు బలహీనమవుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంట, మురుగు కాల్వల కట్టల అక్రమ మట్టి తవ్వకాలు నిలిపివేసేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

సర్వసభ్య సమావేశం బాయ్‌కాట్ చేసిన ఎంపీటీసీలు



కర్లపాలెంలో సర్వసభ్య సమావేశాన్ని బాయ్‌కాట్ చేసిన ఎంపీటీసీ సభ్యులు

కర్లపాలెం: కర్లపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశాన్ని అత్యధిక ఎంపీటీసీ సభ్యులు బాయ్‌కాట్ చేశారు. ఎంపీపీ యారం వనజ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. ఎంపీపీ వనజతో పాటు ఎంపీటీసీలు గొర్ల కమల, దొంతిబోయిన లక్ష్మీసామ్రాజ్యం, కంకిపాటి హైమావతి, చీరాల పద్మావతి, నవనీతం, డి.నాగలక్ష్మి, పందరబోయిన సుబ్బారావు, తాండ్ర సాంబశివరావు, రాతంశెట్టి లక్ష్మణరావు, ఎస్‌కే ఆసిఫ్ అలీ హాజరయ్యారు. సమావేశం జరుగుతున్న సమయంలో ఎంపీటీసీలు సుబ్బారావు, ఆసిఫ్ అలీ, లక్ష్మణరావు, నాగలక్ష్మి, కమల, లక్ష్మీసామ్రాజ్యం, హైమావతి నిలుచుని గతంలో తాము ప్రతిపాదించిన పనులను ఇంతవరకు ఆమోదించ లేదని ఆమోదించిన పనులకు వర్క్ ఆర్డర్లు ఇవ్వటం లేదని నిరసన తెలిపి సమావేశం నుంచి బయటకు వచ్చేశారు. అయినప్పటికీ సర్వసభ్య సమావేశం కొనసాగింది.

- నల్లమోతువారిపాలెం ఎంపీటీసీ సభ్యుడు తాండ్ర సాంబశివరావు మాట్లాడుతూ కర్లపాలెం పంచాయతీ పరిధిలో ఉన్న ఎఫ్‌సీఐ గోదాముల నుంచి ముక్కపురుగులు సమీప గ్రామాలైన సత్యవతీపేట, నల్లమోతువారిపాలెం, కొత్త నందాయపాలెం, ఎంవీరాజుపాలెం గ్రామాలకు వచ్చి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నాయని వాటిని అరికట్టేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వర్క్ ఆర్డర్లు ఇవ్వటం లేదు

తమ ఎంపీటీసీ పరిధిలో సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రతిపాదనలు ఇచ్చినా ఆమోదించటం లేదని ఆమోదించిన పనులకు కూడా వర్క్ ఆర్డర్లు ఇవ్వటం లేదని పెదగొల్లపాలెం ఎంపీటీసీ సభ్యుడు వైస్ ఎంపీపీ పందరబోయిన సుబ్బారావు, ఆవేదన వ్యక్తం చేశారు.

- చింతాయపాలెం ఎంపీటీసీ సభ్యుడు రాతంశెట్టి లక్ష్మణరావు మాట్లాడుతూ సీసీ రోడ్లు కావాలని అడిగినా మంజూరు చేయలేదని గతంలో తమ గ్రామంలో వేసిన బోరింగ్ పంపులకు ఎంబుక్‌లు సిద్ధమైనా నగదు ఇవ్వటం లేదని ఆరోపించారు.

మంజూరైన పనులు జరుగుతున్నాయి.

గత సర్వసభ్య సమావేశంలో ఆమోదించిన పనులకు వర్క్ ఆర్డర్లు ఇచ్చాం. పనులు జరుగుతున్నాయని ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిధిలోని గణపవరం, చింతాయపాలెం, తుమ్మలపల్లి, పెదగొల్లపాలెం, నల్లమోతువారిపాలెం గ్రామాలలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు మొత్తం 9 పనులకు రూ.28 లక్షలు మంజూరు చేశామని కొన్ని పనులు పూర్తవగా మరికొన్ని జరుగుతున్నాయని ఎంపీడీవో వివరించారు.

- కర్లపాలెం-2 ఎంపీటీసీ సభ్యుడు ఆసిఫ్ అలీ మాట్లాడుతూ తమ గ్రామంలో అవసరమైన చోట రోడ్లు వేయాలని ప్రతిపాదనలు ఇచ్చినా మంజూరు చేయటం లేదని తెలిపారు.
- కర్లపాలెం-1 ఎంపీటీసీ సభ్యురాలు దొంతిబోయిన లక్ష్మీసామ్రాజ్యం మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి సమస్య ఉన్నచోట పంపులు వేసేందుకు అడిగినా మంజూరు చేయలేదని కొన్ని గ్రామాల వారికి మాత్రమే పంపులు మంజూరు చేశారని తెలిపారు. వర్క్ ఆర్డర్లు ఇవ్వకపోవటం గతంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవటం వలనే బాయ్‌కాట్ చేశామని సమావేశం నుంచి బయటకు వచ్చిన ఎంపీటీసీ సభ్యులు తెలిపారు.

రహదారే చెత్త కుండీ..!



పట్టణంలో పారిశుధ్యం అధ్వాన్న స్థితికి చేరుతోంది. చెత్త నిల్వలు రహదారిపైకి చేరేంత వరకు మున్సిపల్ సిబ్బంది స్పందించటం లేదని ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. పట్టణంలోని 23వ వార్డు ప్రధాన రహదారిలో రహదారి పక్కన చెత్త కుండీ లేకపోవటంతో చెత్త నిల్వలు రహదారిపైకి చేరాయి. రహదారి సగానికిపైగా చెత్త, వ్యర్థాలు పేరుకుపోవటం, మూగజీవాల స్వైర విహారం చేస్తుండటంతో ఆ ప్రాంతం దుర్గంధ భరితమవుతోంది. అటుగా రాకపోకలు సాగించే వార్డు వాసులు అసౌకర్యానికి గురవుతున్నారు. రహదారిపై చెత్త నిల్వలు చేరకుండా చెత్త కుండీలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు చెత్త నిల్వలు తొలగించాలని ఆ ప్రాంతవాసులు కోరుతున్నారు. – రేపల్లె

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

రేపల్లె: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలోని 10వ వార్డులో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయబడునని ఆ శాఖ డిప్యూటీ ఈఈ శ్యామ్‌సుధాకర్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు



రేపల్లె: నిద్రపోతూ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని పెనుమూడి శివాలయంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల మేరకు కారుమూరు గ్రామానికి చెందిన మోర్ల శ్రీనివాసరావు (57) పెనుమూడి గ్రామ శివాలయంలో నిద్ర చేసేందుకు వచ్చాడని, రాత్రి నిద్రిస్తున్న సమయంలో అనారోగ్య కారణంతో మృతి చెందాడని పేర్కొన్నారు. మృతుని కుమారుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజశేఖర్ శుక్రవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. మృతునికి భార్య, ఇరువురు కుమారులు కలరు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ



రేపల్లె: పట్టణంలోని 1వ వార్డు శ్రీరామకృష్ణ విద్యానిలయంలో విద్యార్థులకు పవర్‌మెక్ ఫౌండేషన్ చేయూతనిచ్చింది. ట్రస్ట్ సభ్యులు సజ్జా కిషోర్-లక్ష్మి దంపతుల సహకారంతో సజ్జా శివరామకృష్ణ ప్రసాద్, సజ్జా బాలాజీలు పాఠశాలలో 100 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి మూడు పుస్తకాల చొప్పున 300 పుస్తకాలను శుక్రవారం అందజేశారు. పేద విద్యార్థులకు ట్రస్ట్ సభ్యులకు పాఠశాల కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు. స్కూల్ సమితి ఉపాధ్యక్షుడు తూనుగుంట్ల పాండురంగారావు, కార్యదర్శి శివశంకర్, కోశాధికారి సుదర్శనరావు, సభ్యులు రఘురామ్, రమణ, మదర్‌థెరిస్సా మహిళా యునెస్కోక్లబ్ డైరెక్టర్ ఝాన్సీలక్ష్మి, విద్యానిలయం బాపట్ల జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, హెచ్‌ఎం జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ పాఠశాలకు ప్రింటర్ అందజేత



ప్రింటర్ అందజేస్తున్న ఉపాధ్యాయిని

జంపని(వేమూరు): పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బద్రీనారాయణ తెలిపారు. వేమూరు మండలంలోని జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ అసిస్టెంట్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఎ.కన్యకాపరమేశ్వరి శుక్రవారం ప్రింటర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీన కన్యకాపరమేశ్వరి ఉద్యోగ విరమణ చేస్తున్నందున పాఠశాలకు ప్రింటర్ అందజేశారన్నారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ విజయబాబు, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు మధుమయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణ సదస్సు విజయవంతం చేయాలి



కరపత్రాలు చూపుతున్న అంబేడ్కర్ యూత్ సభ్యులు

చుండూరు(వేమూరు): నేటి మానవ హక్కుల పరిరక్షణ సదస్సు విజయవంతం చేయాలని అంబేడ్కర్ యూత్ యువత పురుషోత్తం తెలిపారు. చుండూరు మండలంలోని ఆలపాడు గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం కరపత్రాలు ఆవిష్కరించి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపై తెనాలిలో జరిగిన పోలీసుల దమనకాండకు నిరసనగా మానవ హక్కుల పరిరక్షణ సదస్సు తెనాలి ఐతానగర్ పొట్టి శ్రీరాముల పార్కు వద్ద శనివారం నిర్వహించడం జరుగుతుందన్నారు. అంబేడ్కర్ యూత్ యువకులు తరలిరావలెనాని ఆయన కోరారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

రవాణా రంగ రక్షణకు సమ్మెలో డ్రైవర్‌లు పాల్గొనాలి

ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ నాయకులు ముజఫర్



మాట్లాడుతున్న ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ నాయకులు ముజఫర్ అహమ్మద్

రేపల్లె: రవాణా రంగ రక్షణకు రాష్ట్రంలో డ్రైవర్‌ల సంక్షేమ బోర్డు సాధనకై జులై 9న దేశవ్యాప్తంగా జరగనున్న సమ్మెలో డ్రైవర్‌లు టైర్ బంద్ పాటించాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌ఫోర్ట్ యూనియన్ (సీఐటీయు) నాయకులు ముజఫర్ అహమ్మద్ కోరారు. పట్టణంలోని వినాయక సుమోస్టాండ్‌లో శుక్రవారం జరిగిన డ్రైవర్‌ల సమ్మె సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2019 మోటారు వెహికల్ ఎండోమెంట్ యాక్ట్ ప్రకారం ప్రమాదాలు జరిగితే నూతన చట్టాలు తీసుకువచ్చి లక్షలాది రూపాయల పెనాల్టీలు, జైలు శిక్షలు వేస్తూ డ్రైవర్‌లను బాధితులు చేస్తున్నారన్నారు. దీనికి తోడు వాహనాలపై వివిధ రకాల ట్యాక్స్‌ల పేరుతో పాలక ప్రభుత్వాలు లక్షల రూపాయలు వసూలు చేస్తుండంతో డ్రైవర్‌లకు పూట గడవటం కష్టంగా మారుతోందన్నారు. ఆన్‌లైన్ రవాణా సంస్థలు, రాపిడో, వోలా వంటి సేవలతో డ్రైవర్‌లకు కుటుంబ పోషణ భారంగా మారుతుందన్నారు. రాష్ట్రంలో 50 లక్షల పైగా ఉన్న డ్రైవర్‌ల సంక్షేమం కోసం పాలక ప్రభుత్వాలు చర్యలు తీసుకోవటం లేదన్నారు. కేరళలో మాదిరిగా డ్రైవర్‌ల భద్రతకై సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మణిలాల్ మాట్లాడుతూ లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని దేశవ్యాప్తంగా కార్మిక వర్గం నిర్వహిస్తున్న సమ్మెలో ఈ ప్రాంత డ్రైవర్‌లు పాల్గొనాలన్నారు. రేపల్లె పట్టణంలో ఆటోలు, ఫోర్ వీలర్స్ నిలుపుకునేలా స్టాండ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఫోర్ వీలర్స్‌కు పెనుమూడి-పులిగడ్డ వారధితో పాటు కిలో మీటరు దూరంలో ఉన్న మోపిదేవి సమీపంలోని టోల్‌గేట్‌లో అదనపు భారం పడుతోందన్నారు. స్థానికంగా ఉండే వాహనాలకు 15 కిలోమీటర్లలోపు ప్రయాణానికి టోల్గేట్‌లో రాయితీ ఇవ్వాలన్నారు. సమావేశంలో బాపట్ల జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి చెన్ను ప్రహల్లాదుడు, ఇతర యూనియన్‌ల నాయకులు కాలేషా, వాసు, నాగరాజు, విజయ్, రాము, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై మురుగునిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలి



ఇంటూరులో పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో మారుతి శేషంబ

అమర్తలూరు(వేమూరు): రోడ్ల పక్కన మురుగు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీడీవో మారుతి శేషాంబ అన్నారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు గ్రామంలో పారిశుధ్య పనులు శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్ల పక్కన చెట్లు ఉంటే వాటిని తొలగించడం జరుగుతుందన్నారు. గ్రామంలో మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుంతున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కారుబోల్తా పడి నలుగురికి గాయాలు

కొల్లిపర: ప్రమాదవశాత్తు కారు పల్టీ కొట్టి నలుగురికి గాయాలైన ఘటన శుక్రవారం హనుమాన్‌పాలెం వద్ద చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మండల పరిధిలోని దావులూరిపాలెం గ్రామానికి చెందిన ఏమినేని కార్తీక్, ఏమినేని జగదీష్, దొంతగాని గోపి, దొంతగాని శివశంకర్‌లకు గాయాలయ్యాయి. వీరు దావులూరుపాలెం నుంచి రేపల్లె వెళ్తుండగా హనుమాన్‌పాలెం దగ్గర ప్రమాదవశాత్తు రేపల్లె కాలువలోకి కారు పల్టీకొట్టింది. గాయపడిన వారిని స్థానికులు 108లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మురుగు సమస్య లేకుండా పరిష్కారం



వేమూరులో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టిన పంచాయతీ సిబ్బంది

వేమూరు: వర్షాకాలంలో మురుగు నీరు సమస్య లేకుండా పరిష్కారం చేయడం జరుగుతుందని ఎంపీడీవో రవి కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని దళితవాడలో పారిశుధ్య కార్యక్రమం శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. మురుగు సమస్యలు ఉంటే పంచాయతీ దృష్టికి తీసుకువస్తే పరిష్కారం చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి చొప్పర శేఖర్, పంచాయతీ కార్యదర్శి రెడ్డి, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచండి

ఎంపీడీవో అత్తోట దీప్తి

తెనాలిటౌన్: రూరల్ మండలం బుర్రిపాలెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను ఎంపీడీవో అత్తోట దీప్తి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలం దోమలు, అంటువ్యాధులుప్రబలే అవకాశం ఉన్నందున గ్రామంలో శానిటేషన్ మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు రోడ్లపై చెత్త చెదారం వేయవద్దని సూచించారు. పారిశుధ్య సిబ్బందికి తడి, పొడి చెత్తను ఇవ్వాలని సూచించారు. గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందని, ఇటీవల ముగ్గురు చిన్నారులను కరిచినట్లు గ్రామస్తులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో కుక్కల బెడదను అరికట్టాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో వైవిడి ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దైవసేవకులు ఐక్యతతో జీవించండి

తెనాలిఅర్బన్: దైవసేవకులందరూ ఐక్యతతో జీవించాలని ది తెనాలి టౌన్ పాస్టర్స్ అండ్ గాస్పల్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కూచిపూడి అబ్రహం పేర్కొన్నారు. ఐతానగర్ ప్యాడిసన్‌పేటలోని ఈరే న్యూలైఫ్ ఫ్యామిలీ వర్షిప్ చర్చిలో కృతజ్ఞత ఆరాధన కూడికను శుక్రవారం నిర్వహించారు. ఇటీవల విదేశీ పర్యటన ముగించుకుని తెనాలి చేరుకున్న ఈరే మినిస్ట్రీస్ అధినేత బిషప్ కతైర సుధీర్‌కుమార్, ఆయన కుమారుడు బిషప్ జాన్ సెల్వీలను ఘనంగా సన్మానించారు. తెనాలి పరిధిలోని పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు రెవరెండ్ ఎ.భానుప్రసాద్, రెవరెండ్ సర్వోన్నతరావు, పాస్టర్‌లు పాల్గొన్నారు.

నేటి నుంచి 'రథ్ ఫెస్ట్ 2025'



ఇస్కాన్ టెంపుల్‌లో స్వామివారు

తెనాలి: 'ఇస్కాన్' టెంపుల్, తెనాలి ఆధ్వర్యంలో 2025 సంవత్సర రథోత్సవం (రథ్ ఫెస్ట్-2025)లో భాగంగా 'జిజ్ఞాస' సంస్థ సహకారంతో వివిధ సాంస్కృతిక అంశాల్లో రెండురోజుల పోటీలు శనివారం ప్రారంభం కానున్నాయి. స్థానిక వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మొత్తం 51 అంశాల్లో ఈ పోటీలు జరగనున్నాయి. సంగీతం, భగవద్గీత, చిత్రలేఖనం, పెయింటింగ్, క్రాఫ్ట్ పోటీలు శనివారం, నృత్యం, ఏకపాత్ర, క్విజ్, ఫ్యాన్సీ డ్రెస్, క్రియేటివ్ స్పీకింగ్ క్రియేటివ్ రైటింగ్ వంటి పోటీలను ఆదివారం నిర్వహిస్తారు. శ్రీకృష్ణుడు, విష్ణుమూర్తి, వైష్ణవానికి సంబంధించిన అంశాలను ప్రదర్శించవచ్చని ఫెస్ట్ క్యూరేటర్ రోహిణి వైష్ణవి ఒక ప్రకటనలో తెలియజేశారు. అయిదేళ్ల నుండి 29 ఏళ్ల వయసు కలిగిన ఎవరైనా ఈ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ సాంస్కృతిక పండుగకు రాష్ట్ర నలుమూలల్నుంచి 1,000 మంది నమోదు చేసుకున్నారని, ఇంకా ఎవరికైనా ఆసక్తి ఉంటే వైకుంఠపురం ఆలయంలో పేర్లు నమోదు చేసుకోవచ్చని వివరించారు.

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు

మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు



తెనాలిఅర్బన్: మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు పేర్కొన్నారు. పట్టణంలోని 10,11 వార్డుల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఆ వార్డుల్లో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వాహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని మురుగు కాల్వలను ప్రతిరోజు బాగు చేయించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆయన వెంట పలు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.